వాన చినుకులు

డి. కామేశ్వరి

"ఏనే లార్జ్ బి.కె." చీటిమీదరాస్తూ మెల్లిగా అన్నాడు రావు.

"సార్ యిప్పటికే చాల అయింది.. పన్నెండు దాటుతుంది.... "నసిగాడు ముక్త్యార్ అహమద్.

"షటప్ ! నేను చెప్పింది చెయ్యి!" చెయ్యాడించాడురావుకౌంటర్లోముక్త్యార్ విషాదంగా, సానుభూతిగా నవ్వాడు.

గోడమీద స్కర్టింగ్‌పైన గ్లాస్ కేసులో ఉమర్ ఖయ్యాం రంగుల పెయింటింగు : గ్లాస్‌మీద రుబాయి ఒకటి చెక్కబడింది.

"నన్నడగకుండానే, నా యిష్టం తెలుసుకోకుండానే

ఎక్కడినించో ఇక్కడికి నన్ను తోసేశారు

నన్ను అడగనైన అడగకుండా ఈ లోకం నించి

ఎక్కడికిగెంటుతారో, గెంటేస్తారు.

సఖీ గిన్నె నింపు.

ఈ ధూర్తత్వాన్ని మరిపించేందుకు ఇంకో గిన్నె మధువు !"

ఇంగ్లీషు పద్యాన్ని గట్టిగా చదివాడు రావు. అంతా ఖాళీగావుంది. ఎక్కడా ఎవరూలేరు. బార్ ముందు ఎత్తయిన గుండ్రని స్టూలుమీద కూర్చుని మరో గ్లాసు ఖాళీ చేశాడు.

"ముక్త్యార్ ! నీకో పాఠంచెపుతాను. శ్రద్ధగా ఒళ్ళు దగ్గిఱ పెట్టుకుని విను !"

"సార్ !" ముక్త్యార్ యిలాంటి పాఠాలు చాలామంది దగ్గిఱ విన్నాడు. కాబట్టి తనపని తను చేసుకుపోసాగాడు.

"మన హృదయాలు ఎండిపోయిన నేల లాంటివి; బీటలు తీసేశాయి. యిక్కడ ఏ మొక్కా మొలవదు !"....

"అవును సార్ !" ముక్త్యార్ అరలకి తాళాలు బిగిస్తూ పరధ్యానంగా అన్నాడు.

"ఎప్పుడో రెండో మూడో వాన చినుకులు పడుతాయి.... రెయిన్ డ్రాప్స్!.... చల్లబడుతుంది....హాయ్.. హాయ్ !.... ఎంతహాయి !"

"కరెక్ట్ సార్ !"

"కాని ఏం లాభం ? మళ్ళా.... వాన వెలుస్తుంది.... ఎండ కాస్తుంది .... నీరింకి పోతుంది.... క్రితం సాయంకాలం పడ్డ చినుకులు ఎక్కడ అణగారి పోయాయో ఎవరికి పత్తా ?"

"ఏం మిగలదు సార్ !"

"అదే, జీవిత రహస్యం ! అర్థమైందా ?... నౌ, యీ సారి మార్పు కోసం, వన్ ఓల్డ్ స్మగ్లర్ !"

"ఓల్డు స్మగ్లర్ అయిపోయింది సార్ !"

"పోనీ బి. కె"

"అంతా పాత స్టాకు సార్. వాసన బాగులేదు !"

"ఇడియట్ ! ఎందు కంటున్నావో నాకు తెలుసు. కాని, నేనింకా గీత దాటలేదు. సర్లే ! నువ్వుపో !" రావు దిగాడు స్టూల్‌ని రెండు మూడు రౌండ్లు తిప్పి.

"ఇప్పుడే వెళ్ళకండి సార్, కాసేపు ఆ సోఫాలో కూర్చోండి !"

"ఇక్కడ గాదు: వరండాలో !"

వరండాలోకి ఒక సోఫా లాగించాడు ముక్తార్.

"లైటు వెయ్యమంటారా సార్ !"

"వద్దు, మిగతా లైట్లు కూడా ఆర్పెయ్యి ! చీకటి బాగుంటుంది !"

బయట వెన్నెల కురుస్తోంది. గుండ్రంగా తిరిగే ఫౌంటెన్లు యింకా నీరు చిమ్ముతున్నాయి. సన్నగా పొడుగ్గా నీటి కాలన్లో తెల్లగా మబ్బుల నీడలు కదులుతున్నాయి. ఎక్కడో దూరంగా ఎలక్ట్రిక్ దీపాలు తెల్లని వెన్నెల్లో మచ్చల్లా వేలాడుతుంటే, ఎలెక్ట్రిసిటీ వాళ్ళమీద రావుకి చాలకోపం వచ్చింది. పాల వెన్నెల్లో యీ దీపాలవసరం ఏమిటి? అవి ఆర్పవచ్చుని వాళ్ళ కెందుకు తట్టదో ! అనుకున్నాడు.

ఏమిటో అంతా చికాగ్గా వుంది. దేనిమీదో, ఎందుకో కోపం. మెదడంతా ఓ చిన్న సంచిలో పడేసి కుట్టేసినట్టుంది. ఆలోచన ఎటూ సాగడంలేదు. బండగా, మొద్దుగా తయారయింది. ఓ సారి మొగం చిట్లించి పిడికిలితో నుదుటి మీద గట్టిగా రుద్దాడు.

దట్టంగా కమ్మిన పొగ మంచు కొద్ది

గా విడినట్లయింది. ఆ పొగమంచు మధ్య మసక మసగ్గా రత్నమాల కనుపించింది.

రత్నమాల తల దించుకొని కళ్ళు పైకెత్తి తనవంక బిడియంగా చూస్తూంది. పెదాలమీద, మనసులో ఆనందాన్నంతనీ కురిపించే చిరునవ్వు. అలాగే పరిచయమైంది మొదట క్లబ్‌లో.

"చెప్పాను కదూ ! ఈయనే రావుగారు !" మిసెస్ మూర్తి పరిచయం చేసింది ఒక రాత్రి ఎనిమిది గంటలకి.

"ఏం చెప్పింది !"

ఏమిటి చెప్పారు ? ఆ రహస్యం తెలుసుకోకపోతే యింక నాకు నిద్ర పట్టదు !"

"అది మాలో రహస్యం ! మీరడగకూడదు !" కొంటెగా నవ్వింది.

మ్యూజిక్ మొదలవగానే మూర్తి భార్యవంక చూశాడు. రాణి మూర్తి వంక, రత్నమాల వంకా చూసింది. రత్నమాల రావువంక, మూర్తివంక చూసింది.

చివరికి మూర్తి అన్నాడు.

"రావ్! రత్నమాలకి కంపెనీ ఇవ్వవేనూ, రాణి ఒకసారి ఫ్లోర్‌మీదికి పోయొస్తాం."

"రత్నా ! రావుగారితో మాటల్లో పడ్డావంటే నిన్ను నీవు మరచిపోతావు. జాగ్రత్త !" నవ్వి లేచింది రాణి.

రత్నమాల తల దించుకు కూర్చుంది మాట్లాడాల్సిన భారమంతా రావుమీదనే వేసి.

"మీరేం తీసుకుంటారు ?"

"నాకేం వద్దండి."

"మీకు కావాలావద్దా అని నేనడగలేదు !" రావ్ ఆమెకళ్ళలోకి చూశాడు.

ఆ కళ్ళు తడబడుతున్నాయి. ఆమె పెదాలు నవ్వుతున్నా, ఆ కళ్ళలో ఏదో అంతులేని విచారం పీడలా తొంగి చూస్తోంది. కొందరికళ్ళు ఎప్పుడూ అలాగే వుంటాయి. ఆ కళ్ళంటే రావుకెంతో యిష్టం. ఆమె సంభ్రమాన్ని, మొహమాటాన్ని చూసి జాలిగా నవ్వుకున్నాడు రావు.

ఆ తర్వాత, తను స్కాచ్ తీసుకుని ఆమెకి కోకాకోలా అందించాడు. ఇష్టం లేదన్నట్టు పుచ్చుకుని పూర్తిచేసింది రత్నమాల. ఆమె క్రొత్తచోట క్రొత్త మనుష్యులమధ్య యిమడలేకపోతూంది. చుట్టూ అంతా రకరకాల ప్రాంతాల వాళ్ళు. ఉన్నతోద్యోగులు: ఆధునికత ఉట్టిపడే వేషభాషల్తో అంతమంది ఆడవాళ్ళు, మగవాళ్ళ మధ్య ఆ వాతావరణంలో భయంకరమైన వంటరితనం ఆమెని బాధిస్తోంది.

"చూడండి, నేను కొద్దిగా కవిత్వం చెపుతాను. మీకు అదోలా బాధగా వుంటుంది. కాని అది బయటపెట్టకే నా కోసం చిన్నగా నవ్వండి" ఆమెని కుదుట బర్చడానికి తేలిగ్గా మాట్లాడసాగాడు రావు.

"మీరు కవిత బాగా రాస్తారని చెప్పింది రాణి, నాకు పొయిట్రీ అంటే యిష్టం ! చెప్పండి నాకే బాధాలేదు ?"

"నేను కవిత చెప్తానంటే పారిపోకుండా నిలబడ్డవాళ్ళు మీరొక్కరు కనిపించారు. సంతోషం. చూడండి, యీ మనుష్యులంతా ఎవరో గొప్పవాళ్ళనీ మీకన్న పై మెట్టని అనుకోకండి. అంతా ఒకటే ఖాళీ మనుష్యులు! బుట్ట బొమ్మలు! గడ్డికుక్కిన సంచులు! తడారిన మన గొంతుకలు చేసే శబ్దాలు, గాజు గొట్టాల్లో గాలి కూతల్లా, పగిలిన పెంకులమీద ఎలక కాళ్ళ చప్పుళ్ళా, అర్ధరహితమైన ధ్వనులు! ఆకారాల్లేని రూపాలు! కదల్లేని శక్తులు!..."

"మీరు ఇలియట్ ని అప్పజెప్తున్నారు!" దొంగని పట్టినట్టు సంతోషపడింది రత్నమాల.

"మీకు కవిత్వ అభిరుచే కాకుండా ప్రవేశంకూడా ఉందన్నమాట! ఎంత వరకు చదివారు?"

"బి. ఏ. అండి" మళ్ళీ సిగ్గుపడ సాగింది.

"మీ మొహమాటం, బిడియం తగ్గించాలని నేను యిదవుతూంటే మీరు అలా ముడుచుకు పోతారేం? ఇక్కడికి వచ్చే మనుష్యులు ఆనందించాలని, కొన్ని గంటలు తమని తాము మర్చిపోవాలని వస్తారు. ఇక్కడకూడా మన అంతరాలు, హోదాలు, తేడాలు అన్ని గుర్తుంచుకుని బిగుసుకుపోతే యింకెలా? రండి, డాన్సు చేద్దాం."

"నాకు అసలు బొత్తిగా రాదండి, ఎన్నడూ చూడలేదుకూడా" తడబడింది.

"మరేం పర్వాలేదు. ఎడం చెయ్యి నా బుజం మీద వెయ్యండి. కుడిచేత్తో నా ఎడం చేయి పట్టుకోండి. నాతోపాటు అడుగులు వెయ్యండి. అంతే! కమాన్!"

ఆమె తడబడ్తూ, తల వంచుకుని మెల్లగా లేచింది.

ఫాక్స్ ట్రాట్ వాయిద్యం వినిపిస్తూంది. రావు, ఆమె నడుం చుట్టూ చెయ్యివేసి పట్టుకుని ఫ్లోరంతా ఒకసారి తిప్పాడు. రత్నమాలజీవితంలో అదొక క్రొత్త అనుభవం.

"నాతో డాన్సు రాదని చెప్పారు. మోసమన్న మాట!" మూర్తి, రాణి దగ్గరకి వచ్చినప్పుడు మూర్తి, రత్నమాల మీద నెపం వేశాడు.

"నేను చెప్పలా, ఆయన మాటల్లో పడితే ప్రమాదమని" రాణి నవ్వింది.

"మైండ్ యువర్ బిజినెస్! మీరు వాళ్ళ మాటలు వినకండి" రావు నవ్వుతూ రత్నమాలని మరీమూలకిచేర్చాడు.

బాండ్ ఆగింది, మళ్ళీ మొదలైంది. ఈసారి మరో బీట్! రత్నమాల ఏం చెయ్యాలో తోచని దిగ్భ్రమలోఉన్నట్టు నిలబడి పోయింది.

"ఊఁ కానివ్వండి" రావు అన్నాడు.

"దయచేసి నా ప్రార్థన వింటారా? కాసేపు బయట వేరే కూర్చుని కబుర్లు చెప్పుకుంటే యింతకంటే హాయిగా వుంటుంది కదూ!" బెరుకుగా అంది రత్నమాల.

రావు ఆమె కళ్ళలోకి చూశాడు.

ఏదో వేదన, ఆరాటం, నిండి దిమ్మెర పోతగా కురియబోయే మబ్బుల్లాంటి నీడలు కమ్ముకున్నట్టున్నాయి. ఆ కళ్ళలో జాలి పుట్టించే దైన్యం అకస్మాత్తుగా కదిల్చింది.

"ఫర్వాలేదు, రండి" బయటికి లాన్ లోకి నడిచారు ఇద్దరూ. చెట్టు మొదట నీడలో పేం కుర్చీల్లో వాలారు.

"క్షమించండి, మీరు మామూలుగా అందరిలాగ క్రొత్తదనం ఫీలవుతున్నారేమోనని బలవంతం చేశాను. మిమ్మల్ని ఇబ్బంది పెట్టటం నా ఉద్దేశం గాదు!" రావు సంజాయిషీ చెప్పుకున్నాడు.

"మీరు నన్నేం బాధపెట్టలేదు.... నిజానికి."

"నిజానికి ?"

"నిజానికి యీ వూరు వచ్చాక చాల సహజంగా, శాంతిగా ఫీలయింది మీ ఎదుటనే!"

"ఏదన్నా పనిమీద వచ్చారా ?"

"లేదండి .... ఊరికేనే!" ఆమె తల ఎత్తలేదు. ఆమె దాస్తోందని, తనకి చెప్పడం యిష్టంలేదని రావుకి తెలుసు. బలవంతం చేయలేదు,

రెండు రోజులు పోయాక—

ప్రొద్దునే రావు ఆఫీసులో అడుగు పెట్టిన అర్ధగంటకి ఫోన్ మ్రోగింది.

"రావ్"

"రావ్! మూర్తిని మాట్లాడుతున్నాను ఒక చిన్న విషయం."

"పెద్ద విషయమైనా వినడానికి చేయడానికి సిద్ధం!"

"రత్నమాలని చూశావుగా! ఆమెకి ఉద్యోగం కావాలి. నీ దగ్గిర ఖాళీ లున్నాయి గదూ!"

"రత్నమాలకి ఉద్యోగమా ? ఆమె ఊరికే చూడ్డానికి వచ్చిందనుకున్నాను"

"దానికో పెద్ద కథ ఉందిటలే. నేను రాణి నడిగినాగాని తర్వాత చెప్పుడో చెప్తానని దాటేసింది. ఆ గొడవ మన కెందుగాని, నీ దగ్గిర ఖాళీలుంటే,కాస్త సహాయం చేద్దూ!"

"ఖాళీ ఉందిగాని, దానికి ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజినడగడం, వాళ్ళలిస్టు పంపడం అయింది. ఇంటర్వ్యూ తారీఖు కూడా ఫిక్సయింది."

"రావ్! బొత్తిగా అమాయకుడిలా మాట్లాడకు. నువ్వు చెప్పే కారణాలు నిన్ను అడ్డుకోవని నీకూ తెలుసు!" నవ్వాడు మూర్తి.

"ఇంతకీ ఆమెకి గుమస్తా ఉద్యోగమెందుకో ? ఒకసారి నేనామెతో మాట్లాడవచ్చా ?"

"ఎలాగూ ఇంటర్వ్యూ అంటూ ఒకటుందిగా ?"

"ఆ ఇంటర్వ్యూకాదోయ్! నేనామెతో రెండుమూడు గంటలు! హోటలుకో, సినిమాకో వస్తుందేమో అడుగు ?"

"రాకపోవటానికి ఏముంది ? నీకెప్పుడు వీలవుతుందో చెప్పు"

"రేపుఆదివారం. లంచ్, క్వాలిటీలో

తీసుకుని, ఆ తర్వాత వెస్టెండ్‌లో మాట్నీ! అమె నడిగి రింగ్ చెయ్యి మళ్ళీ!"

ఆ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలవేళ క్వాలిటీలో కూర్చున్నారు ఇద్దరూ. బయట ఎండకి విరుగుడన్నట్టు చల్లటి కాంతినిచ్చే దీపాలు, సన్నగా వాద్య సంగీతం. మెల్లగా గుసగుసలు తప్పించి పెద్ద శబ్దంలేని ప్రశాంతత.

"మీరు ఉద్యోగం చెయ్యాలను కోడం నా కాశ్చర్యం కలిగించింది."

"అంత ఆశ్చర్య పోవడాని కేముందండి?"

"చూడండి, యీ ఉద్యోగాలు, కాగితాలు, ఫైళ్ళు, పాడ్‌లు, ఉేపులు, గుండుసూదులు, జేక్లిప్పులు, ఇకానమీ ఫ్లాప్‌లు, 'యస్సార్'లు - యివన్నీ మనుష్యుల్ని మరలు చేస్తాయి. ఆ మోట పనికి మగాడే తగును! పూలు, వెన్నెల, మబ్బులు, లేచిగుళ్ళు, ఆడవాళ్ళు-యివన్నీ సౌందర్యం, సౌకుమార్యం, సున్నితం, లాలిత్యంలాంటి లక్షణాలకి ప్రతిరూపా లనుకుంటాను! వీటన్నింటిని ఉద్యోగాల విషజ్వాలలకు ఆహుతి చెయ్యడం ...."

"మీరు కవిత్వం చెప్తున్నారు!" రత్నమాల నవ్వింది.

"కావచ్చు కాని నా అభిప్రాయాలు కొన్ని మీకు చెప్పాలనే మిమ్మల్నిక్కడికి పిల్చాను కాబట్టి మీరు భరించాలి."

"ఏదో కాలక్షేపం క్రింద వినడానికి నా కభ్యంతరం లేదు."

"అంతేనా?"

"నా పరిస్థితి మీకు తెలియదు. నేను కేవలం ఉద్యోగం చేయాలనే ఆరాటంతో యింత దూరం రాలేదు. నన్ను పరిస్థితులు తరిమాయి!"

"అవి నేను తెల్సుకోవచ్చా?"

"క్షమించండి"

"దట్సాల్ రైట్. ఇంక నేను అడగను ఆ విషయం గురించి"

"మిమ్మల్ని కాదన్నందుకు నన్ను మన్నిస్తారు గదూ?" ఆమె ఇబ్బందిగా, నిస్సహాయంగా చూసింది.

"మీ కెందుకంత గాభరా? నేనేం అనుకుంటాను చెప్పండి!" అమాత్రం అర్థంచేసుకోలే ననుకున్నారా? ఇంకా గొడవ మర్చిపొండి!" రావు నవ్వాడు.

"నిజంగా మీ సహృదయత చూస్తుంటే....మనసు విప్పి చెప్పుకోవాలని ఆరాటం కలుగుతోంది, కాని...."

"ఇంక ఆ గొడవ మరచిపొమ్మన్నాను గదూ! మీకు నా దగ్గిర పని చెయ్యడం అభ్యంతరం కాదనుకుంటాను!"

"అది మహాగౌరవంగా భావిస్తాను"

"అలా మాట్లాడకండి. పొగడ్తలు నన్ను ఇబ్బందిపెడ్తాయి. ఆఫీసు బయట నన్నొక మామూలు స్నేహితునిగా చూడండి!" రత్నమాల కళ్ళు కృతజ్ఞతతో నిండాయి.

ఆ తర్వాత ఎక్స్చేంజి పంపినవా

త్ళైవరూ పనికిరారని రాసి, మరొక లిస్టు పిల్చాడు రావు. ఈసారి లిస్టులో రత్నమాల పేరు వచ్చింది. రత్నమాలకి ఆ ఉద్యోగం వచ్చింది.

రత్నమాల ఉద్యోగంలో చేరాక, రావుకి తను కూర్చునే గది మరీ పెద్ద కనిపించింది. ఆమె సీటు అక్కడ వేశారు.

ఉదయాన్నే ఆఫీసులోకి అడుగు పెట్టగానే రత్నమాల లేచి "గుడ్‌మార్నింగ్ సార్!" అంటుంది. ఆ తర్వాత ఆ రోజు టపా టేబుల్ మీద వుంచి, పిగ్నల్స్, అప్ యిమీడియట్, ఇమీడియట్, ప్రయారిటీ వగైరా తరగతుల ఉత్తరాల్ని వరుసగా అందిస్తుంది. వీటికి రావు యిచ్చే జవాబులు స్థూలంగా అర్థంచేసికొని డ్రాఫ్టు తయారుచేసి, అతని అంగీకారం తీసుకుని టైపు కివ్వడం ఆమె పని.

మొదట్లో రత్నమాలకి పని చాతగా లేదు. ఆఫీసు ఉత్తరాలని తనకి వచ్చిన భాష నంతనీ ఉపయోగించి రాయసాగింది. అందమైన భాష వాడితే రావు సంతోషిస్తా డనుకునేది.



"ఆఫీసు ఉత్తరాల్లో కావల్సింది అందమైన మాటలుగావు. స్పష్టంగా, తేలిగ్గా అర్థమయ్యే మాటలు: అది దృష్టిలో ఉంచుకోండి. మనస్థయిలు వేరేచోట వాడుకుందాం." ఒకసారి రావుచెప్పాక ఆమె మారింది. అతని శక్తి సామర్థ్యాలమీద ఆమెకి గొప్ప గౌరవం కలిగింది.

మొదట ఆమె అక్కడ కూర్చోవడం రావు ఆలోచనల్లో విడవకుండా వెంటాడింది. క్రమేపి ఆ మె ఉనికికి అలవాటు పడ్డాడు అతను. ఆఫీసు నాలుగ్గోడల మధ్య ఆమె అతని దగ్గిఱ అందర్లాగే పనిచేసే ఒక మనిషి.

రెండు నెలలు గడిచాయి.

ఒక మధ్యాహ్నం అతను లంచ్ కానిచ్చిన మరో పదినిమిషాలకి ఆమె టేబిలుముందు నిలబడింది. మొదట ఏదో మామూలు గొడవ అనుకుని కాసేపు తను చూస్తున్న కాగితం మీంచి దృష్టిమరల్చలేదు. అది చదవడం పూర్తి అయ్యాక.

"యస్"—తలెత్తి చూశాడు.

"నాకు సెలవు గావాలండి" అంది. తలవంచుకునే.

"సెలవా? ఎప్పుడు? గ్రాంటెడ్!"

ఆమె కాగితం అందించింది. అది చదవకుండానే దానిమీద 'గ్రాంటెడ్'

అని రాసేసి, "ఎందుకో తెలుసుకో వచ్చా ?" అని అడిగాడు.

"ఒక ఫ్రెండ్ పార్టీకివచ్చాడు. మధ్యాహ్నం వెళ్ళాలి. కొంచెం ఆఫీసునించి తొందరగా వెళ్ళేగాని కష్టం"

"ఎవరా ఫ్రెండ్ ? పార్టీ ఎన్నింటికి ? ఏంపార్టీ ? ఎక్కడ- క్షమించండి మరీ వ్యక్తిగతమైన ప్రశ్నలడుగుతున్నట్టున్నాను !"

"అతనొక కాలేజీ స్టూడెంటు, కొన్నేళ్ళక్రితం పరిచయం అయింది. పేరు శ్యాంసుందర్. అతను కాలేజిలో దేనికో ఎన్నికయ్యాడు. అందుకు వాళ్ళ స్నేహితులందర్నీ పిలుస్తూ, నన్నూ పిల్చాడు. నాలుగున్నరకి ఫొటో, అయిదింటినించి ఆరింటిదాకా పూనమ్ రెస్టారెంట్‌లో రిఫ్రెష్‌మెంట్సు, ఆ తర్వాత ఎంపైర్‌లో సినిమా !... మీక్కావల్సిన వివరాలన్నీ యిచ్చాననుకుంటాను !" చెప్పింది రత్నమాల వేళాకోళంగా.

"కావల్సిన దానికన్నా యెక్కువే యిచ్చారు !" కాగితం ట్రేలోకి విసిరి ప్రక్కకి చూశాడు రావు.

అతను నవ్వకపోవడం ఆమెని బాధపెట్టింది. అక్కడే నిలబడింది.

"మీరు వెళ్ళచ్చు. నిలబడ్డారేం ?" అతను మిగతా కాగితాలేవో చూస్తూ అన్నాడు. ఆ ముభావానికి కారణం తన ప్రవర్తన వల్ల కలిగిన అయిష్టతో, లేక అతని పని బరువో తేల్చుకోలేక మరి రెండు నిమిషాలుండి—

"థాంక్యూ సార్ !" అని వెళ్ళిపోయింది రత్నమాల.

ఆమె వెళ్ళగానే, కాగితాలన్నీ దూరంగా నెట్టి, వెనక్కి వ్రాసి, నిర్లిప్తంగా గోడకేసి చూశాడు.

ఆమె యెదట తన అయిష్టతని అంత స్పష్టంగా ఎలా వెలిబుచ్చాడు ! ఆమె తన గురించి ఏమనుకుందో ? తన మనసులో భావం ఆమెకి అర్థం అయిపోయిందేమో ? మనసంతా చికాగ్గా తయా తయారయింది.

ఎవరీ కాలేజి స్టూడెంట్ ! శ్యాంసుందర్ అతని పేరు. పార్టి, ఫొటో రిఫ్రెష్‌మెంట్స్, సినిమా. యింతేనా ! దీనివెనక ఏదో వుంది. ఆ 'ఏదో' తనకి తెల్సినట్లనిపించింది రావుకి. తన కాలేజీ రోజులు గుర్తుకువచ్చాయి. బాధ్యతా రహితమైన రోజులు. ఆలోచనలన్నీ ఆచరణలో పెట్టాలని వుంటుంది. పరిణామాలని గుర్తులో పెట్టుకోడం జరగదు,

శ్యాంసుందర్ ! పేరు బాగుంది. మనిషీ అంతేనా ? యేమిటో ఆ స్నేహం !

ఆ సాయంకాలం ఆమెని క్లబ్‌లో చూశాక మళ్ళా బయట ఎన్నడూ కలుసుకోలేదు. ఎన్నిసార్లో అడగాలనుకున్నాడు, ఏ సినిమాకో పిలవాలనుకున్నాడు. కాని అడగలేదు.

తనలో ఏదో అడ్డుపడింది. తను అధికారి. తన దగ్గిఱ ఆమె పనిచేస్తోంది. తమ యిద్దర్నీ బయట చూసినవాళ్ళే

మనుకుంటారు ? పైగా ఆమె యిష్టా యిష్టా లెలా వున్నాయో ? తన ఆధిక్యాన్ని అధికారాన్ని దుర్వినియోగపరుస్తున్న ట్టనుకుంటుందేమో! ఒకవేళ బలవంతాన వస్తే అందువల్ల తనకి ఒరిగే దేముండదు. ఏదో నేరం చేసినట్టు బాధపడ్డ మొక్కటే మిగుల్తుంది.

ఈ రకం ఆలోచనల్తో సతమతమై ఏం చెయ్యలేకపోయాడు. పైగా రెండు నెలలు చాల తక్కువ వ్యవధి అనిపించింది తనకి.

రావుకి ఏమిటోలాగుంది ఆ సాయంకాలమంతా. చివరికి అయిదున్నర ప్రాంతంలో కాగితాలేవి చూడకుండానే లేచి వెళ్ళిపోయాడు.

లతీఫ్స్‌లో టీ త్రాగి బయటికి రాగానే రావుకో ఆలోచన వచ్చింది. వెంటనే ఎంపైర్‌కి పోయి టికెట్ తీసుకున్నాడు. ఇంకా ముప్పావుగంట పైముంది. దూరంగా స్టేషన్‌వైపు వెళ్ళిపోయాడు రావు.

ఆరున్నర కావస్తోంది. మరో రెండు మూడు నిమిషాలలో పిక్చరు మొదలవుతుందనగా గుమ్మం దగ్గర క్రీనీడలో నిలబడి హాలు కలయచూశాడు. క్రింది తరగతిలో ఒక మూలగా రత్నమాల. మరో అతను కూర్చున్నారు. ఇద్దరే! మిగతా అందరూ వెళ్ళిపోయారన్న మాట! లేక పార్టీ అంతా ఇద్దరేనా? వాళ్ళిద్దరూ మాటల్లో పడి అతని వంక చూడలేదు.

శ్యాంసుందర్ చామనచాయగా, బాగా పొడుగ్గా వున్నాడు. జాకెట్‌లాంటి చుక్కల టీ షర్టు. అతను మాట్లాడుతూంటే ఆమె శ్రద్ధగావింటూంది. ఒకోసారి నవ్వుతూంది. అదే నవ్వు నిర్మలంగా, ప్రశాంతంగా!

లైట్లార్పగానే, వాళ్ళకిసాధ్యమైనంత దగ్గరగా ఉన్న సీట్లో కూర్చున్నాడు. వాళ్ళిద్దరూ సినిమాలో లీనమయ్యారు. రావు మనసు సినిమాలో లగ్నమవడం లేదు. ఏదో ఆందోళనగా ఉన్నాడు. ఆమె అతనివంక చూసినప్పుడల్లా రావు గుండెల్లో సూదులు గుచ్చినట్టుంది.

ఓ అర్ధగంట ఆ నరకం అనుభవించాక, తనమీద తనకే చెప్పలేని అసహ్యం కలిగింది. తను చేస్తున్న పనేమిటి? ఈ గూఢచర్యకు ఏమి టర్థం? జెలసీ!"

"ఎన్నోసార్లు తను లిఫ్టు యిచ్చి తీసికెళ్ళిన అమ్మాయిలు తనని వదలి యితరు లడగానే డాన్స్‌కి వెళ్ళినప్పుడు తనేం బాధపడలేదు! పైగా అలాంటి బాధలూ, ఆ భావాలూ అనాగరికంగా, సభ్యతాసంస్కారాలు లేనివాళ్ళ మనః ప్రవృత్తిలాగ అనుకొనేవాడు! ఇప్పుడీ పసితనం ఏమిటి?

ఒకమూల తనలో రేగుతున్న బాధ వాళ్ళనింకా కనిపెట్టి చూడమని ప్రోత్సహిస్తున్నా, బలవంతానలేచి వచ్చేశాడు. ఆ రాత్రి బార్‌లో రెండు బాటిల్స్ గోల్డెన్ యీగిల్ త్రాగి గదిలోకి వెళ్ళి పడుకుంటే తెల్లారిపోయింది. తెల్లారాక తనలా వచ్చేయడం చాలా మంచి పని అన్పించింది. క్రితం రోజు బాధ చాల వరకు తగ్గినట్టయింది.

ఆఫీసులో రత్నమాల క్రితంనాటి అతని ముభావాన్ని గుర్తుంచుకొనట్టే నడుచుకుంది. రావు చాల సహజంగా క్రితం సాయంకాలం లేనట్టే మాట్లాడాడు.

"మిస్! యీ సాయంకాలం మీ ప్రోగ్రాం ఏమిటి?" ఏదో కాగితం చూస్తూ మామూలుగా అడిగినట్టు అడిగాడు.

"ఏం లేదండి!"

"నాతో సాయంత్రం ఎక్కడికయినా రావడానికి అభ్యంతరం ఏమన్నా వుందా?"

"ఏమిటలా క్రొత్తగా మాట్లాడుతున్నారు?"

"క్రొత్తగాదు రత్నా! నీతో ఎన్నో రోజులనించి ఒకటి చెప్పాలనుకుంటాను. చెప్పలేక పోతున్నాను. నేను చెప్పింది ఒక అధికారి చెప్పినట్టు తీసుకుని, నీకిష్టం లేకపోయినా సరే ననేస్తావేమోనని భయం! ఎవరో స్నేహితుడు, చాల మామూలు స్నేహితుడు అడిగినట్టనుకో. నీ మనసులో ఏది వుంటే అది చెప్పు. నువ్వు కాదన్నా సరే, నేనేం అనుకోను!"

"మీతో రావడం, కులాసాగా కబుర్లు చెప్పుకోవడం, అన్నది నేను ఊలలుకనే తీయని అనుభూతి అనీ, దానికి విలువ లేదని, ఏంచెప్పి, ఏం చేసి మిమ్మల్ని నమ్మించగలనా అని ఆలోచిస్తున్నాను!"

"ఏమిటో, నా భావాన్ని సరిగ్గా చెప్పలేక పోతున్నాను, నువ్వు మరోలా తీసుకుంటున్నావు! ...మరీ అనుమానాల మనిషిగా కనపడుతున్నానా!" నవ్వాడు రావు

"మీరలా మాట్లాడితే నాకు చాల కష్టంగా వుంటుంది! నన్నెందుకు అర్థం చేసికోరు మీరు?" నిస్పృహాయంగా, బాధగా చూసింది రత్నమాల.

"ఫర్‌గెట్ యిట్. ఇప్పుడు నాలుగున్నర అయింది. నువ్వు వెళ్ళిపో. ఆరింటికి తయారుగా వుండు. నేను వచ్చి పిక్ చేస్తాను!"

"ఆరుగంటలకయితే యింకా చాలా పైముంది. ఇప్పటినించీ వెళ్ళక్కర లేదులెండి. అందరితోపాటే నేనూ వెడతాను!"

ఆ రాత్రి ఎనిమిది గంటల వేళ హోటల్లో కూర్చుని ఏదో ఆర్డరిచ్చాక మెల్లిగా అడిగాడు రావు.

"నీ కప్పుడే స్నేహితులు దొరికినట్టున్నారే, ఊహల్లో!"

"స్నేహితులు అంటూ ఎందరో లేరు! మీకు తెలుసుననుకుంటాను. సుమతి అని 'జి' బ్రాంచిలో పనిచేస్తోంది. ఆమె యింట్లోకి మకాం మార్చాను ఆమె చాలమంచిది. ముసలి తల్లి. యిద్దరు తమ్ముళ్ళు, ముగ్గురు చెల్లెళ్ళు, ఆ కుటుంబంలో నన్నూ ఒకరుగా కలిపేసుకున్నారు వాళ్ళు. శ్యాంసుందర్ ఆమె పెద్ద తమ్ముడు. ఇంటిదగ్గిఱ పరిచయమే. నిన్నేదో కాలేజి ఎలక్షన్‌లో నెగ్గాడట. వాళ్ళ క్లాస్‌మేట్‌లు, అబ్బాయిలు, అమ్మాయిలు ఒక డజనుమందితోపాటు నన్నూ

పిల్చారు. కాదనలేకపోయాను. తీరా హోటలునించి బయటికి రాగానే, సినిమాకి రామనికొందరు. యింతకు ముందే చూశామని కొందరు, ఇంటి దగ్గిర పెద్దవాళ్ళు కేకలు వేస్తారని కొందరు తప్పించుకున్నారు. నాకు తప్పింది గాదు. పదిగంటలకి గూటికి తిరిగి వచ్చాను!"

రత్నమాల చాల పెద్ద సంజాయిషీ యిచ్చింది. తన భావాలన్నీ ఆమెకి తెలిశాయా? తెలిసి. తనని నమ్మించాలని ఆమె ప్రయత్నిస్తోందా? రావు ఆలోచించాడు. ఆ చిక్కులు ప్రశ్నలు వేసుకొన్న కొద్దీ చిక్కుపడ్డం తప్పించి విడ్డంలేదు.

"నేనప్పుడప్పుడిలా పిలిస్తే ఏమను కోవుగదూ!"

"నిజం చెప్పమంటారా?"

"ఊఁ!"

"ఈ రెండుమూడు నెలల్లో ఒక్కసారైనా మీరు పిలవలేదని నాకు చాలబాధ అనిపించింది తెలుసా! మన మిద్దరంఒకేరకంఅభిరుచులుగలవాళ్ళం. నాకెంతో మాట్లాడాలనుంటుంది. మీతో ఏదో చెప్పాలని, చర్చించాలని. రోజూ కనీసం ఓ గంట ఆఫీసు విషయాలు కాకుండా, ఏవేవో కబుర్లు చెప్పుకుంటే ఎంతో బాగుంటుందని ఆశపడ్డాను చాల సార్లు! కాని మీతో ఏమని చెప్పను? ఎలా చెప్పను? మీరు బాస్ కాకపోతే బహుశా, స్పష్టంగా చెప్పేదాన్నేమో!"

"మిస్!...." ఏదో చెప్పబోయాడు రావు.

"దయచేసి అలా ఆఫీసు ధోరణిలో పిలవకండి. ఇందాక పిలిచారే. అలా రత్నా అంటే సంతోషిస్తాను"

"సారీ..రెండు నెలలు అనవసరంగా వృధాచేశాంగదూ? నామీద యింత మంచి అభిప్రాయం ఉన్నందుకు నా కృతజ్ఞత ఎలా తెలుపుకోను చెప్పు."

"అలా అనకండి, ఇప్పటికే మీకు నే నెంతో ఋణపడి వున్నాను."

"ఆ ఋణం అలా ఎప్పటికీ పెరుగు తూండాలనే నా కోరిక. లేకపోతే...."

"లేకపోతే?"

"లేకపోతే నువ్వు దూరమైపోతావని భయం!"

రత్నమాల తలదించుకుంది. చాలసేపు మాట్లాడలేదు. రావుకి చాల తృప్తిగా వుంది. అతను చెప్పదల్చుకున్నది చెప్పేశాడు. ఆమె అర్థంచేసుకున్నట్లే మాట్లాడింది. ఆమె మాటల్లో అత నూహించని సామ్యం, అభిమానం కనపడ్డాయి. అంతకన్నా ఆమెనుంచి అతను కోరే దేం లేదన్నట్టనిపించింది.

ఆ తర్వాత సుమారు రెండు నెలలు చాల సన్నిహితులయ్యారు యిద్దరూ. యించుమించు రోజూ బయట ఓ గంట గడిపేవారు.

ఒకరోజు ప్రొద్దునే ఆఫీసుకి రాగానే సీటులో రత్నమాల నిలబడి వుంది. టేబిల్ అంతా ఖాళీ. కాగితాలన్నీ నీటుగా పేర్చి ఉన్నాయి. పనేం ముట్టు కోనట్టు తెలుస్తోంది.

"మోర్నింగ్, రతన్ !" అతనే ముందు చెప్పాడు.

"గుడ్ మోర్నింగ్ సర్!" బొంగురు గొంతుతో, తలెత్తకుండానే అంది.

"ఏమిటా ఆలోచన ?" టేబుల్ దగ్గరే నిలబడి అడిగాడు.

చేతిక్రింద దాచిపెట్టిన గులాబిరంగు కాగితం ముందుకి తోసింది.

టెలిగ్రాం ! విప్పి చూశాడు రావు.

"జరిగింది మర్చిపో, నీ యిష్టమే జరుగుతుంది. అమ్మ చావు మంచం మీద ఉంది. వెంటనే రా ! - నాన్న."

"ఏమిటది ?" మొగం చిట్లించాడు రావు. ఆమె ఇంట్లోంచి ఎందుకు వచ్చేసిందో, ఉద్యోగంలో ఎందుకు చేరిందో అతను మళ్ళీ ఎప్పుడూ అడగలేదు. ఆమె చెప్పలేదు.

రత్నమాల తల నింకా వంచుకొని మాట్లాడలేదు.

"ఇంటిదగ్గర తగువు పెట్టుకు వచ్చేశావా ? నాతో ఎన్నడూ చెప్పలేదే ? అసలు గొడవ ఏమిటి ?"

"నన్నిప్పుడేం అడక్కండి. చెప్పగలిగే స్థితిలో లేను. మరో రెండు గంటల్లో బండివుంది. నేను వెళ్ళాలి. నాకు శలవుకావాలి. కాదు. నేను రాజీనామా చేస్తున్నాను" రత్నమాల కళ్ళల్లో నీరు తిరుగుతుంటే తలప్రక్కకి తిప్పుకుంది.

"మూర్తికి వాళ్ళకి చెప్పావా ?"

"అసలు గొడవ రాణికి తెలుసు. ఈ సంగతి వాళ్ళకింకా చెప్పలేదు."

"నువ్విక్కడ వున్నట్టు యింటి దగ్గర తెలుసా ?"

"మొదట్లో తెలియదు. తర్వాత రాణి రాసివుంటుంది."

కాసేపు ఏదో కలలో వున్నట్టు నిలబడ్డాడు రావు. ఏం చేయాలో తోచలేదు. అంతా గజిబిజిగా వుంది.

"సెలవు తీసుకో, రాజీనామా యెందుకు ?" రావు సందిగ్ధంగా అన్నాడు. "కాదు, నేవెళ్ళాలి, ఇంక యీ ఉద్యోగం చేయను."

"రండి, మొదట మూర్తివాళ్ళ యింటికి వెళ్ళి, ఆ తర్వాత మీ గదికి వెళ్దాం." రావు సెలవురాసి హెడ్ క్లర్క్ కిచ్చాడు. ఇద్దరూ రాణియింటికి వెళ్ళారు. మూర్తి ఇంట్లోలేడు.

టెలిగ్రాం చూసి రాణి నవ్వింది.

"నీ యిష్టం నెరవేరబోందిగా ! సంతోషించాలి. అంత బాధగా చూస్తావేం ! అమ్మ చావు మంచం ఎక్కడం నిజం అనుకుంటున్నావా ? వెర్రిపిల్లా ! నువ్వు వెంటనే వస్తావని అలా చిన్న అబద్ధం ఆడివుంటారు ! అంతే !"

"అంతేనంటావా ?" అనుమానంగా అడిగింది రత్నమాల.

"అవును, నాకూ అలాగే అనిపిస్తుంది. ఇంతవరకూ నకా ఐడియా రానేలేదు" రావుకూడా చెప్పాడు.

"ఏమైనా, నేను వెళ్ళాలి"

"బెస్టలక్ ! స్టేషన్‌కి వెళ్ళేటప్పుడు ఇలారండి, నేనూవస్తాను. ఈ లోపల నేను తయారవుతాను. అట్టేసైం ఉన్నట్టు లేదు।" తొందరగా అంది రాణి.

కొద్ది సేపటికి....

గార్డు యీల వేశాడు. రైలు కూసింది. రత్నమాల నీళ్ళు చిందిన కళ్ళతో రావుకి బాగా పరిచయమైన చూపుతో చేతులు జోడించి అతనికేసి చూసింది.

"మీ ఋణం ఎప్పటికీ తీర్చుకో లేను !" గొంతు జీరపోగా, కృతజ్ఞతా భావంతో అంది.

"డోంట్ బీ సిల్లీ।" రావు అన్నాడు మెల్లిగా రత్నమాల చెయ్యి నొక్కి విడిచిపెడుతూ.

రైలు కదిలింది. రత్నమాల వెళ్ళిపోయింది. ఇంటికి తిరిగి వచ్చేదాకా రావు ఏం మాట్లాడలేదు.

"కాసేపు మా యింట్లో కూర్చోగూడదూ ? ఎలాగూ శలవు పెట్టిన ట్లున్నారు. ఇప్పుడింక ఇంటికి వెళ్ళి ఏంచేస్తారు ? ఇవాళ ఇక్కడే భోంచేసి వెడుదురుగాని !" కారు దిగేముందు నవ్వుతూ అడిగింది రాణి.

"అంతకన్న యింకేం కావాలి ?" దిగాడు రావు. ఇద్దరూ లోపలికి నడిచారు.

"ఇంతకీ రత్నమాల యింట్లోంచి ఎందుకు వచ్చేసింది ? ఏమా కథ ?"

"ఆమెనే అడగలేకపోయారా ?"

"అడిగాను ఒకసారి, చెప్పలేదు. ఆఖర్న ఇవాళ మళ్ళీ అడిగాను. మిమ్మల్ని అడగమంది."

"కథేం లేదు. చాల మామూలు సమస్య" రాణి కళ్ళు, పెదాలు కొంటెగా నవ్వుతున్నాయి.

"ఏమిటది ?"

"ముందు కాఫీ తాగండి, తర్వాత విందురుగాని తాపీగా !" రాణి కాఫీ కలిపి యిచ్చింది. రావులో ఉత్కంఠ ఎక్కువైంది.

"కథేం లేదు. అనగనగా ఒక అమ్మాయి. ఆ అమ్మాయి వాళ్ళ బావ చిన్నప్పటినించి ఒక కంచంలో తిని, ఒక మంచంలో పడుకుని పెరిగారు. ఇద్దరూ కలిసి చదివారు. ఇద్దరూ ఒకర్నొకరూ ఎంతో అభిమానించుకుని, ప్రేమించుకున్నారు. ఇద్దరూ రంగు రంగుల కలలు కన్నారు వాళ్ళ భావి జీవితాన్ని గురించి. ఆ అబ్బాయి. ఈమెతోపాటే చదువు మానేసి ఉద్యోగం చూసుకున్నాడు. గారాల ఏకైక ముద్దులకుమార్తెకి, చదువుకున్న అమ్మాయికి, యింకా పెద్ద చదువులు, పెద్ద ఉద్యోగాలు వున్న అబ్బాయిని చూశాడు అమ్మాయి నాన్న. అమ్మాయి వాదించి ఏడ్చి రాగాలెట్టినా వాళ్ళ నాన్న

వినక పోవడంతో, అది భరించలేక స్నేహితురాలి దగ్గరకి వచ్చి ఆశ్రయం కోరింది. అక్కడొక దొరగారు ఆమెకి ఉద్యోగమిచ్చారు. ఈ లోగా స్నేహితురాలు యింటికి నీతి బోధ చేస్తూ ఉత్తరం రాసింది. వాళ్ళ నాన్న మనసు కరిగింది. టెలిగ్రాం ఇచ్చి కూతుర్ని యింటికి పిలిపించుకున్నాడు. అమ్మాయి కలలు పండాయి. ఇవాళోరేపో వాళ్ళ బావని పెళ్ళి చేసుకుని మురిసిపోతుంది. కథ కంచికి. మంచి బహుమతి ఏదన్నా కొని తయారుగా వుంచుకోండి, పంపించడానికి"_ తను చెప్పిన మాటల అందానికి, ఆ నేర్పుకి మురిసి పోతున్నట్టు నవ్వింది రాణి.

మరో పది నిమిషాల కెలాగో కూర్చుని_

"క్షమించండి, ఇంకోసారి ఎప్పుడైనా వస్తాను!" అని లేచాడు రావు. రాణి ఏమిటేమిటో చెప్పి అతన్నాపాలని శత విధాల ప్రయత్నించింది. కాని రావు వినిపించుకునే స్థితిలో లేడు.

* * *

ఎలానో, ఎక్కడ్నుంచో తనకి తెలియకుండా ఆకస్మాత్తుగా వచ్చి కొద్ది రోజులు తనని మురిపించి, వచ్చినట్టే, అంత తేలిగ్గానూ వెళ్ళిపోయింది! ఆమె కోసం తనకింత ఆరాటం, ఆందోళన ఎందుకు? తనని తాను మరచిపోయాడు.

మొదట్లో జాలి, సానుభూతి, తర్వాత దయ, అభిమానం, మధ్యలో అసూయ, చివరికి మమత, అనురాగం ఎన్నో రకాల అనుభూతులు తనని వశం చేసికొన్నాయి! ఈ లక్షణాల నేమనాలి? ఇంత తేలిగ్గా ఈ ఇంద్ర జాలంలో యెలా పడ్డాడు?

వానచినుకులు భూమిని శూలాల్లా గుచ్చుతాయి. మచ్చ పడుతుంది. మరు క్షణంలో యింకిపోతుంది. మహా ఐతే గుంట పడవచ్చు. కాని ఈ గుర్తు లెంత కాలం వుంటాయి? ఈ సంఘటనలూ, వాటి జ్ఞాపకాలు అంతే, ఎప్పటికో అప్పటికి అన్నీ మట్టిగొట్టుకుపోతాయి. తనెందుకింత వ్యధపడటం?

వాచ్ మేన్ కర్ర నేలమీద చేస్తున్న చప్పుడికి పూర్తిగా మెలకువ వచ్చింది రావుకి. ఒక్కసారి కళ్లు గట్టిగా చికిలించి చూశాడు.

బయట పండు వెన్నెల కురుస్తోంది. దూరంగా హెడ్డింగ్ దగ్గర తెల్లటి పూలు విచ్చి మెరుస్తున్నాయి. వలయాలు చుట్టుతున్న ఫౌంటెన్లు ఆగిపోయాయి. పిట్టేదో అరిచింది.

"ఐ యామ్ ఎ బ్లడీ ఫూల్!" గట్టిగా అనుకుని లేచాడు రావు.

వాచ్మన్ సెల్యూట్ చేశాడు.

***